

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి నాలా నిర్మాణ పనులను వివరిస్తున్న ఈఈ కార్తీక్

ఎస్‌ఎన్‌డీపీ నాలాలోని మురుగునీరు ఓవర్‌ఫ్లో కాకుండా చర్యలు తీసుకోండి

● ఇంజనీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే సూచన

ఎల్‌బీనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌పార్కుకాలనీలో ఎస్‌ఎన్‌డీపీ నాలాలోని మురుగునీరు డ్రెయిన్ల ద్వారా కాలనీలో ఓవర్‌ఫ్లో కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని గ్రీన్‌పార్కుకాలనీలో జరుగుతున్న ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలన్నారు. రోడ్డు నంబరు 17లో చేపట్టే పనులను చెరువు లెవల్స్‌కు అనుగుణంగా చేయాలని సూచించారు. నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధాకర్, నాయకులు తిలక్, మధుసాగర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

అభివృద్ధిలో ఐఎస్ సదన్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

సైదాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ఐఎస్ సదన్ డివిజన్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. సుబ్రహ్మణ్యంనగర్‌లో రూ.21.85లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డుపనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పెండింగ్ పనులు దశలవారీగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు రాజ్యలక్ష్మి ప్రసాద్‌రావు, సత్యనారాయణ రాజు, సందీప్ సాగర్, శర్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంతో జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న కామినేని వైద్యులు

మన్సూరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మధుమేహం పట్ల జాగ్రత్తగా ఉండాలని కామినేని ఆస్పత్రి డాక్టర్లు బి. శ్రావ్య, భవానీ సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సరిగా నిద్రలేకపోవడం, బయటి ఆహారం తీసుకోవడం, ఊబకాయం వంటి సమస్యల కారణంగా మధుమేహం వస్తోందన్నారు. మధుమేహం బారిన పడిన వారు డాక్టర్ల సలహా పాటించాలని సూచించారు.



దాసరి బాబును సన్మానిస్తున్న సీఐటీయూ నేతలు

సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులుగా దాసరి బాబు, కృష్ణయ్య



సీహెచ్ కృష్ణయ్య

సరూర్‌నగర్/హయత్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులుగా మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన సీనియర్ నాయకుడు దాసరి బాబు, హయత్‌నగర్‌కు చెందిన సీహెచ్ కృష్ణయ్య నియమితులయ్యారు. గురువారం మీర్‌పేట్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాసరిబాబును సన్మానించారు. వారు మాట్లాడుతూ అసంఘటిత రంగంలోని కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడతామని తెలిపారు. సీఐటీయూ నాయకులు యాదగిరిచారి, శివ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు గీతా స్వరూపరాణి

మనీ మేనేజ్‌మెంట్ అందరికీ అవసరం

మన్సూరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మనీ మేనేజ్‌మెంట్ నిర్వహణ ప్రతీ ఒక్కరికీ అవసరమని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతా స్వరూపరాణి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ సమానత్వం, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు స్వప్న, మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారంచేసిన వ్యక్తికి న్యాయస్థానం జీవిత ఖైదు, జరిమానా విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. నీటి సరఫరా పని చేసే సతీష్ ఓ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా 9వ అదనపు సెషన్స్ జడ్జి ఎంకే పద్మావది నిందితుడికి జీవిత ఖైదు, రూ. 22 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా..!

● పార్కింగ్ స్థలంలో వాణిజ్య సముదాయాల నిర్మాణం
● జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి
● చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



హస్తినాపురం డివిజన్ జడ్పీ రోడ్‌లోని తుల్జాభవానీ కాలనీ ఆర్చి పక్కన పార్కింగ్ స్థలం లేని వాణిజ్య భవనం

చంపాపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలో నివాసిత, వాణిజ్య, బహుళ అంతస్తులకు ఒకలా అనుమతి తీసుకొని మరోలా నిర్మిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి భారీగా గండి పడుతోంది. కొందరు గృహ నిర్మాణాల పేరిట అనుమతులు తీసుకొని వాణిజ్య భవనాలు నిర్మిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తూ నిర్మాణాలు

హస్తినాపురం డివిజన్ జడ్పీ రోడ్‌లోని తుల్జాభవానీ కాలనీ ఆర్చి పక్కన ఐదు అంతస్తుల వాణిజ్య అవసరాల కోసం బిల్డింగ్ నిర్మించారు. భవనం అనుమతి కోసం జీహెచ్‌ఎంసీకి దరఖాస్తు చేసుకున్న సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌ను పార్కింగ్ స్థలంగా చూపించి అనుమతులు పొందారు. బిల్డింగ్ ఎన్‌ఓసీ వచ్చిన తర్వాత పార్కింగ్ స్థలంలో వాణిజ్య అవసరాల కోసం షట్టర్లు ఏర్పాటు చేసి భవనం యజమాని షాపులకు అద్దెకిచ్చారు. ప్రస్తుతం పార్కింగ్ స్థలం కనుమరుగు కావడంతో రహదారిని పార్కింగ్ స్థలంగా వినియోగించుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఈ తతంగం కనిపించకపోవడం గమనార్హం. దీంతో జీహెచ్‌ఎంసీకి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయానికి గండి పడుతోంది. ఇదొక్కటే కాదు.. జడ్పీ రోడ్‌లోని పలు ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా ఎన్నో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలోని కింది నుంచి పై స్థాయి అధికారులకు మామూళ్లు అందుతుండడంతో యథేచ్ఛగా పనులు కొనసాగుతున్నాయి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లే..

చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలో అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదు. తూతూ మంత్రంగా యజమానులకు నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చేస్తున్న నిర్వాకంపై జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి ఎల్‌బీనగర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్‌ను ఫోన్‌లో వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి



జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గృహ, వాణిజ్య భవనాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలి. రహదారుల వెంట పుట్టగొడుగుల్లా అక్రమంగా షెడ్లు వెలుస్తున్నాయి. సెట్‌బ్యాక్, పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మిస్తున్నారు. అనుమతి లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలను అధికారులు కూల్చివేయాలి.

- లక్ష్మణ్, స్థానికుడు, చంపాపేట డివిజన్

కోమటికుంట చెరువు పరిసరాల్లో చెత్త వేయొద్దు

● బడంగ్‌పేట్ కమిషనర్ సరస్వతి



చెరువులో ఆయిల్ బాల్స్ వేస్తున్న కమిషనర్ సరస్వతి

సరూర్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో గల కోమటికుంట చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ పి.సరస్వతి పేర్కొన్నారు. చెరువు పరిసరాలు, చెరువులో వ్యర్థాలు వేయొద్దని ప్రజలకు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం కోమటికుంట చెరువు వద్ద స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దోమల నివారణ నిమిత్తం చెరువులో ఆయిల్ బాల్స్ వేశారు. చెరువు పరిసరాల్లో చెత్తా చెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కమిషనర్ సరస్వతి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని చెరువుల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రజలు చెత్తను మునిసిపల్ ఆటోలు, రిక్షాల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పదవీ కాలం పూర్తయ్యేలోగా కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి

● మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి



మన్సూరాబాద్ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

హయత్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తన పదవీ కాలం పూర్తయ్యేలోగా కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఆయన గాయత్రినగర్ కాలనీలో రూ. 10.70 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన, శ్రీవెంకటేశ్వరనగర్ కాలనీలో రూ. 24 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, పవనగిరి కాలనీ ఫేజ్-3లో రూ. 33 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల్లో రూ. 5 కోట్లు మంజూరు చేయించి కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. బొమ్మలగుడి నుంచి డబల్ బెడ్‌రూం ఇళ్ల వరకు రోడ్డును విస్తరిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చానని చెప్పారు. కార్యక్రమంలో కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు రాజు యాదవ్, కొలన్ రాజేందర్, జయ తేజ చౌదరి, సోమ శేఖర్, దామోదర్, ఆంజనేయులు, మహేష్, బాలు, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌బాబు, హరీష్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరం



ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థులకు వివరిస్తున్న టీటీఐ అధికారులు

కొత్తపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి అన్నారు. గురువారం బాలాపూర్ ఎడిఫై వరల్డ్ స్కూల్ విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోగల రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. ఎస్‌ఐ నర్సింహారావు, ఆర్‌ఎస్‌ఐ సంతోష్ కుమార్, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్ విద్యార్థులకు పార్కులో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నిబంధనల రంగురంగుల పోస్టర్లు, ట్రాఫిక్ సూచికలనూ చూపుతూ వాటి గురించి వివరించారు. విద్యార్థులు పార్కు ఆవరణలో సైకిళ్లు తొక్కుతూ నిబంధనలను తెలుసుకున్నారు.

మందుబాబులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి సూచించారు. టీటీఐ లెక్చర్ హాల్‌లో గురువారం 51 మంది మందుబాబులకు కుటుంబ సభ్యుల సమక్షంలో ఎస్‌ఓపీలు అమరవర్ధన్ రెడ్డి, అల్లూరయ్యతో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే జరిగే నష్టాల గురించి వీడియో క్లిప్పులు ప్రదర్శించారు.

టీటీఐ అధికారులు పలు ప్రాంతాల్లో నిబంధనల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై ఎస్‌ఐ నర్సింహారావు, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్‌తో కలిసి ఘట్‌కేసర్ పోచారం ఇన్‌ఫోసిస్ రోడ్, ఇన్‌ఫోసిస్ మెయిన్ గేట్, ఉప్పల్ రోడ్, జీడిమెట్ల రోడ్, అన్నోజిగూడ రోడ్ తదితర ప్రాంతాల్లో 442 మందికి అవగాహన కల్పించారు.

18 లోపు కేవైసీ వివరాలు ఇవ్వండి

చాదర్‌ఘాట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల విభాగం ఒకటో సర్కిల్ పరిధిలోని రేషన్ కార్డుదారులందరూ ఈనెల 18వ తేదీ లోపు కేవైసీ వివరాలు ఇవ్వాలని సహాయ సరఫరా అధికారి నర్సింగ్‌రాజ్ తెలిపారు. కేవైసీ వివరాలు ఇవ్వని వారి రేషన్ కార్డుదారులకు వచ్చేనెల కోటా రేషన్ బియ్యం నిలిచిపోయే అవకాశం ఉందన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చాదర్‌ఘాట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ గ్యాస్ లీక్ చేసి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. ద్వారాకాపురం రోడ్-3లో యు. ప్రతిభ (40) భర్త ప్రవీణరెడ్డి, ఎనిమిదేళ్ల కుమార్తెతో కలిసి నివసిస్తోంది. గురువారం కుమార్తెను స్కూల్‌లో దించి వచ్చిన తర్వాత ఆమె గ్యాస్ సిలిండర్‌ను బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్లింది. గ్యాస్ లీక్ చేసి లైటర్‌ను నొక్కగానే ఒక్కసారిగా మంటలు చెలరేగి సిలిండర్ పేలడంతో ప్రతిభ తీవ్రంగా గాయపడింది. స్థానికులు గుర్తించి ఆమెను ఓమిని ఆస్పత్రికి అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గ్యాస్ సిలిండర్ పేలుడు ధాటికి ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురై కాలిపోయాయి. పోలీసులు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రతిభ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలో ఓ సారి ఆత్మహ్యకు యత్నించిందన్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో తీవ్రంగా గాయపడిన మహిళ

ఫోన్‌కు అశ్లీల చిత్రాలు

● చైతన్యపురి పోలీసులకు మహిళ ఫిర్యాదు

చాదర్‌ఘాట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌కు అశ్లీల చిత్రాలు వస్తున్నాయంటూ ఓ మహిళ చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొత్తపేట మార్గదర్శి కాలనీ నివాసి యలమంచిలి హిమబిందు మొబైల్ ఫోన్‌కు అశ్లీల చిత్రాలు వస్తున్నాయి. అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న నాగిరెడ్డి అలియాస్ నాగ సుబ్బారెడ్డిపై అనుమానం వ్యక్తం చేసింది. పోలీసులు అతడిని విచారించారు. హిమబిందు వాడుతున్న మొబైల్‌లోని సిమ్ కార్డు నాగిరెడ్డి పేరుపై ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. గతంలో వారు స్నేహితులుగా గుర్తించారు. తాను అశ్లీల చిత్రాలు పంపలేదని నాగిరెడ్డి తెలిపారు. సిమ్ వాడినంత మాత్రాన అతడే అశ్లీల చిత్రాలు పంపినట్లు ఆధారాలు లేవు. అతడి పేరుతో ఉన్న సిమ్‌ను ఆమె ఎందుకు వినియోగిస్తుంది, ఆ సిమ్‌కు అశ్లీల చిత్రాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి అనే దానిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన 'కాకతీయ' విద్యార్థులు



కప్పు అందుకుంటున్న విద్యార్థినులు

మన్సూరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరో ఇంటర్ స్కూల్స్ కబడ్డీ బాల బాలికల చాంపియన్‌షిప్-2025 పోటీల్లో మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని కాకతీయ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. పోటీల్లో నగరంలోని 34 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా కాకతీయ పాఠశాల విద్యార్థులు అండర్-12 విభాగంలో బాలురు, అండర్-16 విభాగంలో బాలికలు ప్రథమ స్థానంలో నిలిచి సత్తాచాటారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు రవిచారి, బి.వెంకట్, ప్రిన్సిపాల్ పరిమళ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, అధికారులు

మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

హయత్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలకు 175 కుట్టు మిషన్లను కాంగ్రెస్ నాయకులు, అధికారులు పంపిణీ చేశారు. కుట్టు మిషన్లు మంజూరు చేయించినందుకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ హయత్‌నగర్, గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, నాయకులు తిరుమల శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్, నిరంజన్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



కాళోజీ నారాయణరావుకు నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం సమాఖ్య నేతలు రమణారావు, రంగారావు, జయరాం తదితరులు

కాళోజీ నారాయణరావుకు నివాళి

ఎల్‌బీనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజాకవి కాళోజీ నారాయణరావు పరితపించారని తెలంగాణ బ్రాహ్మణ సంఘం సమాఖ్య అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. కాళోజీ వర్ధంతి సందర్భంగా కొత్తపేట హుడా కాంప్లెక్స్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘం సమాఖ్య ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గూడ జయరాం, సంయుక్త కార్యదర్శి మల్యాల వెంకటేశ్వర్‌రావు, ప్రముఖ న్యాయవాది చుండూరు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ రాజగోపుర పనులకు రూ. లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సౌభాగ్యపురంలోని అలివేలు మంగ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయ రాజగోపురం పనులకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి గురువారం లక్ష రూపాయలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాలయ, కమిటీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కేవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చోరీ అయిన ఫోన్లు బాధితులకు అందజేత



చోరీ అయిన, పోగొట్టుకున్న ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. 15 ఫోన్లను బాధితులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి. నరేష్, క్రైం ఇన్‌స్పెక్టర్ జయశంకర్ పాల్గొన్నారు.

- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దండెం రాంరెడ్డి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం గ్రామానికి చెందిన కొలుగురి రవీందర్ ఆటో డ్రైవర్. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మృతి చెందారు. రవీందర్ కుటుంబానికి అండగా ఉంటానని రాంరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శేఖర్, మల్లేష్, రమేష్, సురేష్, బాషా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.